క్లుప్తంగా

అడల్ట్ బీసీజీ టీకాతో క్షయ వ్యాధి దూరం



తెనాలిరూరల్: అడల్ట్ బీసీజీ టీకాతో క్షయ వ్యాధి నుంచి రక్షణ పొందవచ్చునని సంగం జాగర్లమూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హనీఫ్ తెలిపారు. అంగలకుదురు సచివాలయం–2 పరిధిలో గురువారం బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ హనీఫ్ మాట్లాడుతూ బీసీజీ టీకా వేయించుకోవడం వలన భవిష్యత్తులో క్షయ వ్యాధిని అంతం చెయ్యవచ్చని తెలిపారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు సైతం వ్యాక్సిన్ వేయించుకోవచ్చని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ తమ దగ్గర్లో ఉన్న సచివాలయంలో ఏఎన్‌ఎంను సంప్రదిస్తే బీసీజీ టీకా వేస్తారని చెప్పారు. తెనాలి టీబీ యూనిట్ సూపర్‌వైజర్ డాక్టర్ పల్లికొండ రవికుమార్ మాట్లాడుతూ బీసీజీ టీకా కరోనా వ్యాక్సిన్ కాదని గత 100 ఏళ్లుగా పుట్టిన చిన్న పిల్లలకు ఈ టీకా వేసి చెబుతూ ఈ టీకా వేయించుకోవడం వలన పెద్దవారికి 20 సంవత్సరాల వరకు క్షయవ్యాధి వచ్చే అవకాశం ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎం లక్ష్మీ, ఆశా కార్యకర్తలు సమాధానం, సునీత, ఆముల్య, సచివాలయ సిబ్బంది, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

పేదలకు బియ్యం పంపిణీ



తెనాలిఅర్బన్: ట్రైబల్ మినిస్టీస్ అధ్యక్షురాలు రావూరి అంజలి ఆధ్వర్యంలో యడ్లలింగయ్య కాలనీలోని గిరిజనులకు గురువారం బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ సంస్థ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇంటూరి విజయభాస్కర్, దోనేపూడి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నక్షత్ర శాంతి మహాయజ్ఞం



తెనాలి: స్థానిక గంగానమ్మపేటలోని శ్రీ విద్యా పీఠం, సాలిగ్రామ మఠం ట్రస్ట్, తెనాలి ఆధ్వర్యంలో జరుగుతున్న శ్రీ నవగ్రహ సహిత శ్రీ నక్షత్ర శాంతి మహాయజ్ఞం 22వ రోజైన గురువారం ఘనంగా నిర్వహించారు. మృగశిర నక్షత్రం వారితో గణపతి పూజ, రుద్రాభిషేకం, గణపతి హోమం, నవగ్రహ హోమం, నక్షత్ర శాంతి హోమం, మృత్యుంజయ హోమాన్ని యల్లాప్రగడ పవన్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో రుత్విజులు జరిపించారు. బ్రహ్మానంద సరస్వతి (బాలస్వామీజీ) భక్తులను ఉద్దేశించి అనుగ్రహ భాషణ చేశారు. ట్రస్ట్ ఛైర్మన్ నంబూరు వెంకట కృష్ణమూర్తి, సహాయ కార్యదర్శి ముద్దాభక్తుని రమణయ్య, కాపూరు సుబ్బారావు, పెనుగొండ వెంకటేశ్వరరావు, గోపు రామకృష్ణ, కొనగాళ్ల నాగేశ్వరరావు, విజయలక్ష్మి మాత్రుమండలి సభ్యులు గోపు ప్రభావతి, గుర్రం పద్మ, పెనుగొండ ప్రమీల, కనికచర్ల జానకి, వసంత, గౌరి పాల్గొన్నారు. మాసశివరాత్రి ఆయనందున పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

కౌలు రైతు గుర్తింపు కార్డులతో మేలు



తెనాలిరూరల్: భూమిని కౌలుకు తీసుకుని సాగు చేసే వారికి కౌలు రైతు గుర్తింపు కార్డులతో ఎంతో మేలు చేకూరుతుందని మండల వ్యవసాయాధికారి జి.ప్రేమ్ సాగర్ తెలిపారు. మండలంలోని బుర్రిపాలెం, తేలప్రోలు గ్రామాల్లో సాగుదారులకు కౌలుదారు గుర్తింపు కార్డులపై గురువారం అవగాహన సదస్సులు నిర్వహించారు. కౌలు రైతు గుర్తింపు కార్డు వల్ల కలిగే ప్రయోజనాలను కౌలు రైతులకు వివరించారు. భూ యజమానులు పొందే ప్రయోజనాలపై అవగాహన కలిగించారు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంట దెబ్బతింటే గుర్తింపు కార్డుల ద్వారా ప్రభుత్వ సహాయం లభిస్తుందని చెప్పారు. వీఆర్‌వోలు లేదా రైతు భరోసా కేంద్రాలలో పని చేస్తున్న వీఆర్‌ఏలకు దరఖాస్తులు అందజేసి కార్డులు పొందాలని సూచించారు. ఆయా గ్రామాల కార్యదర్శులు, వీఆర్‌వోలు, వీఆర్‌ఏలు, రైతులు పాల్గొన్నారు.

అల్లూరి ఆశయ సాధనకు కృషి చేయాలి



అల్లూరి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ప్రఖర్‌జైన్, అధికారులు



అల్లూరికి నివాళి అర్పిస్తున్న చైర్‌పర్సన్ రాధిక

సబ్ కలెక్టర్ ప్రఖర్‌జైన్, చైర్‌పర్సన్ రాధిక

తెనాలి: మన్యం వీరుడు, స్వాతంత్య్ర సమరయోధుడు అల్లూరి సీతారామరాజు 127వ జయంతి వేడుకలను తెనాలిలో గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖర్‌జైన్ ఆధ్వర్యంలో అల్లూరి జయంతిని జరిపారు. అల్లూరి సీతారామరాజు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సీతారామరాజు ధైర్య సాహసాలను, చేసిన పోరాటాలను స్మరించుకున్నారు. కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కౌన్సిల్‌లో..

రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాలులో స్వాతంత్య్ర యోధుడు అల్లూరి సీతారామరాజు జయంతిని నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అల్లూరి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. స్వాతంత్య్ర పోరాట కాలంలో తన దైన బాటలో బ్రిటిష్ పాలకులపై పోరాటం చేసిన అల్లూరి సీతారామరాజు స్ఫూర్తి ప్రదాతగా నిలిచి పోరాని రాధిక కొనియాడారు. అసిస్టెంట్ కమిషనర్ కె.అనూష మాట్లాడుతూ నేటి యువత అల్లూరి సీతారామరాజు ధైర్యసాహసాలు, దేశభక్తి అలవరచుకుంటూ సన్మార్గంలో నడవాలని సూచించారు. పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు, వివిధ సెక్షన్ల అధిపతులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

అల్లూరికి ఘన నివాళి

తెనాలిరూరల్: అల్లూరి సీతారామరాజు 127వ జయంతి సందర్భంగా రూరల్ మండల గ్రామం కొలకలూరులోని క్షత్రియ నగర్‌లో ఆయన విగ్రహానికి పలువురు పూల మాలలు వేసి నివాళులర్పించారు. బ్రిటీష్ పాలకుల నిరంకుశత్వాన్ని ప్రశ్నించి ఎదురు తిరిగి పోరాడిన విప్లవ వీరుడు సీతారామరాజు అని కొనియాడారు.

విప్లవ వీరుడికి నివాళి

కొల్లిపర: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ భీమవరపు పద్మావతి ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకను గురువారం అధికారులు ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ పద్మావతి అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి అల్లూరి చేసిన సేవలను ఆమె కొనియాడారు. కార్యక్రమంలో



కొల్లిపరలో అల్లూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ పద్మావతి



కొలకలూరులో అల్లూరి సీతారామరాజు విగ్రహానికి నివాళులర్పిస్తున్న స్థానికులు

మండల పరిషత్ పరిపాలన అధికారి చంద్రమోహన్, సీహెచ్ సూర్యప్రకాశరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కొణిజేటి రోశయ్య జీవితం ఆదర్శనీయం

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అన్నాబత్తుని శివకుమార్



రోశయ్య విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న అన్నాబత్తుని శివకుమార్

తెనాలి: తెనాలి నుంచి రాజకీయాల్లోకి ప్రవేశించి అంచెలంచెలుగా ఎదుగుతూ అనేక ఉన్నత పదవులు చేపట్టిన స్వర్గీయ కొణిజేటి రోశయ్య జీవితం రాజకీయ నేతలకు ఆదర్శమని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య జయంతిని గురువారం ఇక్కడ ఘనంగా నిర్వహించారు. శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానం సత్రం కమిటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే శివకుమార్ దేవస్థానం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన రోశయ్య కాంస్య విగ్రహానికి పుష్పాంజలి సమర్పించారు. దాదాపు ఆరు దశాబ్దాల రాజకీయ జీవితంలో రికార్డు స్థాయి విజయాలను ఎన్నింటినో రోశయ్య దక్కించుకున్నారని సోదాహరణంగా చెప్పారు. రాష్ట్ర ఆర్థిక మంత్రిగా 17 సార్లు శాసనసభలో బడ్జెట్ ప్రవేశపెట్టిన అరుదైన అవకాశం రోశయ్యకే దక్కిందని గుర్తు చేసుకున్నారు. తన వాగ్ధాటి, సమయోచిత సంభాషణలతో శాసనసభ సమావేశాల్లో గుర్తింపును పొందారని చెప్పారు. క్రమశిక్షణ, నిబద్ధత కలిగిన నాయకుడిగా వివరవరకు గడిపారని వివరించారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు నూతక్కి వెంకట వేణుగోపాల్, కార్యదర్శి బూర్లె నరసింహారావు, మున్సిపల్ వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, మద్దాలి శేషాచలం, కొణిజేటి గోపీకృష్ణ, నంబూరు నరేంద్ర, తాడిబోయిన రమేష్, అక్కిదాసు కిరణ్‌కుమార్, షేక్ మీరావలి పాల్గొన్నారు.

గుప్తా కాలేజీలో..

పట్టణంలో 1991లో పొట్టి శ్రీరాములు విద్యాసంస్థను ఏర్పాటు చేసిన ఎన్‌ఆర్‌కే అండ్ కేఎస్ఆర్ గుప్త డిగ్రీ కాలేజీని స్థాపించటంలో సంస్థ గౌరవ అధ్యక్షుడు, నాటి ఆర్థికశాఖ మంత్రి కొణిజేటి రోశయ్య అందించిన సలహాలు అమూల్యమైనవని పొట్టి శ్రీరాములు విద్యాసంస్థ కోశాధికారి రావూరి సుబ్బారావు అన్నారు. మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య 91వ జయంతి సందర్భంగా గుప్త డిగ్రీ కాలేజీలో గురువారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సీనియర్ అధ్యాపకుడు ఎం.నాగరాజు మాట్లాడుతూ రోశయ్యతో తనకు గల అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఏడుగురు ముఖ్యమంత్రులకు పరిపాలనలో రోశయ్య అండగా నిలిచినట్టు వివరించారు. పొట్టి శ్రీరాములు విద్యాసంస్థ మేనేజర్ డి.శ్రీనివాసరావు, అవుతు శ్రీనివాసరెడ్డి, అధ్యాపకులు కేవీ రవికుమార్, షేక్ రఫీ, ఆర్‌వీ సునీత, జి.భారతి, ఐ.కృష్ణకుమారి, ఎ.నాగరాజు, దుర్గారావు, శశికర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య నేతల ఆధ్వర్యంలో..



నివాళులర్పించిన ఆలపాటి రాజా, ఆర్యవైశ్య నేతలు

ఆర్యవైశ్య నేతల ఆధ్వర్యంలో తమిళనాడు మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య విగ్రహానికి మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ శ్రద్ధాంజలి ఘటించారు. మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్ పెండేల వెంకట్రావు, పెండేల సుబ్బారావు, శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరీ దేవస్థానం కమిటీ అధ్యక్షుడు నూతక్కి వెంకట వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

నీట్ ఫలితాలపై సమగ్ర విచారణ జరిపించాలి

ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పాశం వెంకటేష్ డిమాండ్



కళాశాల బస్సులను నిలిపివేసిన ఏఐఎస్ఎఫ్ నాయకులు



పాఠశాలను మూసి వేయిస్తున్న విద్యార్థి సంఘ నాయకులు

తెనాలిఅర్బన్: నీట్ పరీక్ష ఫలితాలపై సుప్రీంకోర్టు జడ్జితో సమగ్ర విచారణ జరిపించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పాశం వెంకటేష్ డిమాండ్ చేశారు. నీట్ పరీక్ష పేపర్ల లీక్ కావడాన్ని నిరసిస్తూ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో గురువారం తెనాలి పట్టణంలో విద్యా సంస్థల బంద్ నిర్వహించారు. పట్టణంలోని పలు విద్యా సంస్థలకు యూనియన్ నాయకులు వెళ్లి విద్యార్థులను బయటకు పంపారు. బస్సులను నిలిపివేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ విడుదల చేసిన ఫలితాలలో 720కి 720 మార్కులు అరుగురికి రావటం పలు అనుమానాలకు తావిస్తోందని అన్నారు. వెంటనే నీట్ పరీక్షను రద్దు చేయటంతో పాటు దానిని నిర్వహించిన ఎన్‌టీఏ సంస్థను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జీవో నెంబర్ 77ను రద్దు చేయాలని కోరారు. విద్యార్థి నాయకులపై గతంలో పెట్టిన కేసులను ఎత్తివేయాలన్నారు. జిల్లా నాయకులు మద్దినేని కిరణ్ బాబు మాట్లాడుతూ నీట్ పరీక్ష పేపర్ లీకేజీ అయ్యిందని పెద్ద ఎత్తున దేశవ్యాప్తంగా ఆందోళనలు జరుగుతున్నా కేంద్రం స్పందించకపోవటం బాధకరమని తెలిపారు. దీనికి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు గండు శివ, భావేష్, పాశం వినయ్, గౌతమ్, చక్రి, శ్రీను, ఎస్ఎఫ్ఐ నాయకులు వసంత్, వై.శశికాంత్, భాను వెంకటసాయి, పలు విద్యార్థి సంఘ నాయకులు పాల్గొన్నారు.

తెనాలి ఐతానగర్‌లోని ఎన్ఎస్ఎస్ఎంహెచ్ పాఠశాలలో నాడు–నేడు పనుల నిమిత్తం ఆవరణలో ఇసుకను తోలించారు. పాఠశాలను బంద్ చేసేక్రమంలో గురువారం విద్యార్థి సంఘ నాయకులు మూయించడంతో కొందరు ఉపాధ్యాయులు విద్యార్థులతో ఇసుక మోయించారు. విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పాల్సిన ఉపాధ్యాయులు దగ్గరుండి మరి పాఠశాల ఆవరణలో ఉన్న ఇసుకను వేరే ప్రాంతానికి విద్యార్థులతో తరలించడం పలు విమర్శలకు తావిస్తోంది. ఉపాధ్యాయులు



ఇలాంటి చర్యలు మానుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

–తెనాలిఅర్బన్

పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి



పొక్లయిన్‌తో మురుగునీటిని బయటకు పంపుతున్న దృశ్యం

తూములూరు(కొల్లిపర): వర్షాకాలం మొదలు కావటంతో పంచాయతీ పరిధిలోని పారిశుధ్య కార్మికులు, వార్డు మెంబర్లు పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, ఎటువంటి సమస్యలు ఉన్నా వెంటనే తన దృష్టికి తీసుకురావాలని సర్పంచ్ బాణావత్ అరుణాబాయ్ అన్నారు. గురువారం మండల పరిధిలోని తూములూరు గ్రామంలో గ్రామ వార్డు మెంబర్ అవుతు సుధాకర్ రెడ్డి , కూటమి నాయకులతో కలసి గ్రామ సందర్శన చేశారు. ఎస్సీ కాలనీ వద్ద మెయిన్ రోడ్డు చావిడి సీసీ రోడ్డు వరకు సుమారు 300 మీటర్ల వరకు వర్షం కారణంగా నీరు నిల్వ ఉండటం జరుగుతుందని దీని వలన బడికి వెళ్లే విద్యార్థులు, మహిళలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గ్రామ సర్పంచ్ దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే సర్పంచ్, కార్యదర్శి మృత్యుంజయరావు స్పందించి మురుగు నీరు బయటకు పోవటానికి పొక్లయిన్ ద్వారా రోడ్డు వెంబడి సన్న కాలువ తీసి రోడ్డుపై ఉన్న మురుగు నీటిని బయటకు పంపే ఏర్పాటు చేశారు. అనంతరం రోడ్డుకు ఇరువైపులా బ్లీచింగ్ చల్లించారు. పంచాయతీ ఆధ్వర్యంలో వెంటనే సిమెంట్ తూములు వేయించి ఈ సమస్య రాకుండా పరిష్కరించాలని వార్డు మెంబర్ అవుతు సుధాకర్ రెడ్డి కోరారు. దీనిపై పరిశీలించి సమస్య రాకుండా ఏటువంటి చర్యలు తీసుకుంటే బాగుంటుందన్న అంశాలను పరిశీలించి శాశ్వత పరిష్కారం చేయటం జరుగుతుందని సర్పంచ్ స్థానికులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొల్లి కోటిరెడ్డి, జనసేన నాయకులు కట్టా శ్రీహరిరెడ్డి, చాగంటి సుబ్బారెడ్డి, బదురు వంశీ, కొండా కిషోర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసం.. రూ.10 లక్షలు స్వాహా

గుంటూరు ఈస్ట్: ఆన్‌లైన్ మోసంపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొరిటిపాడుకు చెందిన హేమంత్‌కుమార్ టెలిగ్రామ్ యాప్‌లో టాస్క్ అపరేట్ చేశాడు. అందులో టాస్క్‌పెట్టి పూర్తి చేస్తే డబ్బులు ఇస్తామని చెబుతారు. టాస్క్ నిర్వాహకులు చెప్పిన విధంగా పలుమార్లుగా రూ. 10 లక్షలు చెల్లించాడు. మోసపోయినట్లు గుర్తించి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వంగవీటి మోహనరంగాకు ఘన నివాళి



రంగా విగ్రహం వద్ద నివాళి

తెనాలి, తెనాలి రూరల్: రూరల్ మండల గ్రామం కొలకలూరులో మాజీ ఎమ్మెల్యే వంగవీటి మోహనరంగా 77వ జయంతిని ఘనంగా నిర్వహించారు. రాధా రంగా మిత్రమండలి ఆధ్వర్యంలో రాజీవ్ సెంటర్‌లోని రంగా విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. సోమవరపు సతీష్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం సందర్భంగా అక్కడే మొక్కలు నాటారు. గ్రామసర్పంచ్ బండికర్ల ప్రసాద్, కంచర్ల ఏడుకొండలు, పుట్టా రవి, పఠాన్ బాషా, పసుపులేటి కిరణ్, జూకంటి దాని, పూసపాటి కొండయ్య పిల్లి రాజశేఖర్, నాగం సత్యం, ఆరేపల్లి కృష్ణ, తన్నీరు శీను, పసుపులేటి శీను, కొండ్రెడ్డి రాంబాబు, నాగ వెంకటేశ్వరావు, మనోజ్, కత్తుల బుజ్జి, కొండ్రెడ్డి రామారావు, మద్దు సతీష్, పసుపులేటి సత్యనారాయణ, తోట కిషోర్, శివరామకృష్ణ, పోతల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రంగా సేవలు మరువరానివి

తెనాలిఅర్బన్: బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడిన వంగవీటి రంగా సేవలు మరువరానివని వంగవీటి రాధా రంగా స్మారక కాపు యువజన సేవా సమితి వ్యవస్థాపకులు తన్నీరు శివశంకర్ కొనియాడారు. మాజీ శాసనసభ్యుడు వంగవీటి మోహన రంగా జయంతిని పురస్కరించుకుని నాజర్‌పేటలోని ఆయన విగ్రహానికి గురువారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. రంగా సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ దంతాల ప్రేమ్ కుమార్, మిర్యాల గంగాధర్, కన్నెగంటి సుబ్రహ్మణ్యం , పెటేట్టి రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

‘మాదిగ జన జాతర’ విజయవంతానికి పిలుపు



కరపత్రం ఆవిష్కరించిన ఎమ్మార్పీఎస్ నాయకులు

తెనాలి: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) 30వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 7న ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం ఈదుమూడిలో జరుగనున్న ‘మాదిగ జన జాతర’ను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు కొలవరపు కోటేశ్వరావు పిలుపునిచ్చారు. రూరల్ మండల గ్రామం కంచర్లపాలెంలో గురువారం మాదిగ జనజాతర కార్యక్రమానికి సంబంధించిన ‘హలో మాదిగ..ఛలో ఈదుమూడి’ కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. ఎమ్మార్పీఎస్ ఆవిర్భవించిన ఈదుమూడి మాదిగ జాతి ప్రజలకు పుణ్యభూమి, పవిత్ర భూమిగా ఆయన అభివర్ణించారు. జన్మభూమి రుణం తీర్చుకోవటానికి మాదిగ జాతి ప్రజలంతా జన జాతరలో పాల్గొనాలని కోరారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర నాయకులు ఏటుకూరి విజయ్‌కుమార్ మాదిగ, జిల్లా కన్వీనర్ కోమరాల శ్రీనివాసరావు మాదిగ, ఎల్లమట్ల దాసు మాదిగ, జిల్లా కో కన్వీనర్ కన్నెర నాగరాజు మాదిగ, కంచర్లపాలెం గ్రామ యూత్ కోపల్లె రవి నాయుడు, కొలవరపు జోసెఫ్, దేవరపల్లి రోశయ్య, కొక్కిలిగడ్డ సుధాకర్, నందూరి కోటి, రాయస్వామి, ఎర్రగుంట్ల విజయ్‌బాబు, కోపల్లె సురేష్, వేజెండ్ల నాని, కొలవరపు అఖిలాష్, కొలవరపు అభి, వేజెండ్ల మంగయ్య, ఎర్రగుంట్ల మధుబాబు, జడ సంసోను, కొలవరపు సాతి ర్లో, బుల్ల మనోజ్, పిమూరి గోపి, పి.కళ్యాణ్, కొలవరపు లూథర్, కోపల్లె నాసూ, బుర్ర రాజేష్ పాల్గొన్నారు.

పరవశింపజేసిన వైద్యనాధన్ గాత్ర కచేరీ



తెనాలి: పట్టణానికి చెందిన సంగీత సంస్థ శ్రీ సీతారామ గాన సభ 77వ వార్షిక శాస్త్రీయ సంగీత ఉత్సవాల్లో భాగంగా రెండో రోజైన గురువారం జరిగిన గాత్ర సంగీత కచేరీ సంగీతాభిమానులను పరవశింపజేసింది. స్థానిక కొత్తపేటలోని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ హాలులో సాయంత్రం ఏర్పాటైన వేదికలో హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ సంగీత విద్వాంసుడు వైద్యనాధన్ బాలసుబ్రహ్మణ్యం గాత్ర కచేరీ జరిగింది. తొలుత విఘ్నేశ్వర స్వామి కీర్తనతో ఆరంభించి త్యాగరాయ స్వామి, నీలకంఠ స్వామి దీక్షితులు, శ్రీపి స్వాతి స్వామి కీర్తనలను శ్రావ్యంగా ఆలపించారు. మంచి గాత్రం, చక్కని స్వరాలాపనతో వీనులవిందైన రాగాలతో కూడిన గానాలాపనను పెద్దసంఖ్యలో విచ్చేసిన సంగీతాభిమానులు ఆసాంతం శ్రద్ధగా విన్నారు. వైద్యనాధన్ బాలసుబ్రహ్మణ్యం గాత్రానికి, హైదరాబాద్‌కు చెందిన కోమండూరి అనంత శౌరిరాజన్ వయోలిన్‌పై, విజయనగరం కళాకారుడు మండపాక రవి మృదంగంపై వాయిద సహకారం అందించారు. శ్రీ సీతారామ గాన సభ అధ్యక్షురాలు పిరాట్ల రమణి, కార్యదర్శి దుర్భా హరిబాబు శాస్త్రి, సహాయ కార్యదర్శి కేవీ రామకృష్ణ, ఉపాధ్యక్షులు దుర్భా కొండన్నశాస్త్రి, సభ్యులు వరుదారి సుబ్బారావు, డాక్టర్ చింతలపాటి మంజుల, దుర్భా జనప్రిత్ పాల్గొన్నారు. సంగీత ఉత్సవాలలో భాగంగా శుక్రవారం సాయంత్రం ప్రముఖ హరికథా కళాకారుడు డాక్టర్ ముప్పవరపు వెంకట సింహాచల శాస్త్రిచే భక్త రామదాసు హరికథా కాలక్షేపం ఉంటుందని తెలియజేశారు.

భక్తిశ్రద్ధలతో చండీహోమం



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ వేంకటేశ్వరస్వామి ఆలయ ధార్మిక ప్రాంగణంలో భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ ఆధ్వర్యంలో గురువారం మాసశివరాత్రి సందర్భంగా విశ్వశాంతిని కాంక్షిస్తూ చండీహోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బొప్పెలపల్లి సత్యనారాయణ, లలితాంబ దంపతులచే తొమ్మిదిమంది వేదపండితులు గణపతికి, శివలింగానికి, నవగ్రహాలకు విశేష అభిషేకాలు, అర్చనలు, లక్ష్మీ గణపతి, చండీ, రుద్ర హోమాలు నిర్వహించి, పూర్ణాహుతి చేశారు. ఆలయ అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య, కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.